

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 174 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 25, మే 2026 | పేజీలు 5 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# రాజ్యాంగానికి రక్షకులెవరు?






రక్షణ లేమిలో భారత రాజ్యాంగం

భారత రాజ్యాంగంపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్న ప్రజా ప్రతినిధులు

భారత రాజ్యాంగాన్ని బద్నామ్ పాలు చేస్తున్నారు

రాజకీయ అధికారాలు పొందుకోవడం కోసమే రాజ్యాంగాన్ని వాడుకుంటున్నారు

రాజ్యాంగాన్ని గౌరవించనోళ్ళు దేశాన్ని ఎలా ప్రేమిస్తారు

ఎన్నికల ముందు ఏం మాట్లాడినారు ఎన్నికలయ్యాక ఏం మాట్లాడుతున్నారు

పాలకుల చేతిలో పతనమవుతున్న భారత రాజ్యాంగం

కపట ప్రేమికుల చేతుల్లో నలిగిపోతున్న రాజ్యాంగం

రాజ్యాంగానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సింది ప్రభుత్వాలే


భారత రాజ్యాంగంపై నిరంతర దాడులు జరుగుతున్నాయి

డాక్టర్ బరిగెల శివ









డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భారత రాజ్యాంగంపై కుట్రలు జరగడం కొత్తేమీ కాదని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.దేశ ప్రజలకు అత్యంత భద్రత కల్పించే చట్టాలను న్యాయస్థానాలను రూపొందించిన భారత రాజ్యాంగాన్ని పతనం చేయాలనే కుట్రలు దినదినానికి పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దేశ ప్రజలు చట్టాలను న్యాయస్థానాలను ఎలా గౌరవించుకోవాలో రాజకీయాలు ఏ విధమైనటువంటి సమర్థతను ప్రదర్శించాలో భారత రాజ్యాంగం ఆనాడే నేర్పిందని గుర్తు చేశారు.అనాదికాలంగా రాజకీయంలో రాజకీయ నాయకులు వాళ్లు పోషిస్తున్న క్రియాశీలక పాత్రలన్నీ రాజ్యాంగంలో రూపొందించబడిన విధానాలేనని గుర్తు చేశారు.దేశాన్ని గౌరవిస్తున్నామంటూ దేశాన్ని ప్రేమిస్తున్నామంటూ భారత రాజ్యాంగంపై దాడులకు పాల్పడుతున్న పాలకుల వక్రబుద్ధి దినదినానికి పైపెచ్చుకు చేరిపోతుందని మండిపడ్డారు.రాజ్యాంగాన్ని రక్షించుకుంటా మంటూ ప్రతి సందర్భంలో పెద్దపెద్ద సాంకేతాలిస్తూ రాజ్యాంగ విలువలకు విలువలను ఇవ్వకుండా భారత రాజ్యాంగంలోని అంశాలను ఒక్కొక్కటిగా నామరూపం లేకుండా చేయాలని దుర్మార్గపు కుట్రలను కొనసాగిస్తున్నారని హెచ్చరించారు.భారత రాజ్యాంగాన్ని విస్మరిస్తూ దేశానికి చేసిన గొప్ప మేలు ఏమిటో దేశాన్ని పాలిస్తున్న తెలియజేయాల్సి ఉందన్నారు. అదే సందర్భాన్ని ప్రస్తావిస్తూ దేశాన్ని పాలిస్తున్న పాలకులను ప్రశ్నిస్తే ఏ ఒక్కరు సమాధానం చెప్పలేరని ఘాటుగా విమర్శించారు.రాజ్యాంగాన్ని పాటిస్తూ జరుగుతున్న రాజకీయ ఎన్నికలు రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని ప్రస్తుతం భారతదేశంలో ఎన్నికల సరళిలో ఏర్పడుతున్న మార్పుల వల్ల దేశ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని దుయ్యపడ్డారు.దేశంలో తీవ్రంగా పెరిగిపోతున్న పేదరికం దేశ ప్రజలను ఎంతగానో బాధపెడుతుండగా భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా పరిపాలన కొనసాగుతున్న ప్రతి రాష్ట్రంలో రాష్ట్ర ప్రజల జీవన విధానాలు దిక్కుతోచని పరిస్థితికి చేరిపోయాయని తీవ్రంగా మనస్థాపన చెందారు.

**రాజ్యాంగంపై రాక్షసుల దాడులు!..**

దేశంలో తీవ్రవాద సంస్థలు ఏ విధంగా పెరిగిపోతున్నాయో భారత రాజ్యాంగంపై దాడి చేసే వ్యక్తులను రాక్షసులుగా సంబోధించాల్సిన అవసరం ఏర్పడిందని పిలుపునిచ్చారు.ప్రజా క్షేత్రంలో రాజ్యాంగాన్ని రక్షిస్తున్నామంటూ రాజకీయ రొంపులో రాజ్యాంగంపై దాడులు చేసే వ్యక్తులను రాక్షసులని పిలవకపోతే మరేమంటారో దేశ ప్రజలు

- మిగతా 2లో..

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్

ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ

మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య

గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ

5



## రేవంత్‌కు మోదీ ఆఫర్..

భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చు: ధర్మపురి అర్వింద్

సువేందు అధికారి, షిండేకు ఇచ్చినట్టుగా రేవంత్ కు మోదీ ఆఫర్ ఇచ్చి ఉండొచ్చన్న అర్వింద్

ఆఫర్ తిరస్కరించినందుకు భవిష్యత్తులో రేవంత్ పాశ్చాత్తాప పడొచ్చని వ్యాఖ్య

భగీరథ్ పై పోక్సో కేసు వెనుక తన హస్తం ఉందన్న ప్రచారాన్ని ఖండించిన అర్వింద్



5

3

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి: ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

## తాలు, తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు

రైతుకు నష్టం కలిగించే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



3



## రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు..

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం

వ్యవసాయ కనెక్షన్లు మినహా అందరికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం

మీటర్ల ఖర్చును 60:40 నిష్పత్తిలో భరించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్న ప్రభుత్వం

గత ప్రభుత్వ ఒప్పందాన్నే తాము ముందుకు తీసుకెళ్తున్నామన్న మంత్రి పొంగులేటి

5

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# శ్రమకు శిఖరాగ్ర గౌరవం

## తెలంగాణ శ్రమశక్తి అవార్డు గ్రహీత డా.చిలుకు స్వామికి ఘన సన్మానోత్సవం



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

సమాజ సేవ,కార్మిక హక్కుల పరిరక్షణ,నిరంతర శ్రమతో ఉన్నత స్థాయికి ఎదిగిన తెలంగాణ శ్రమశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామి గారికి ఈరోజు బందు సేవా మండలి ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో అత్యంత వైభవంగా సన్మానోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాదిగ మహాశక్తి జాతీయ అధ్యక్షులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మరియు తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై డాక్టర్ చిలుకు స్వామిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, “మట్టిలో పుట్టిన మాణిక్యంలా మన సమాజంలో డాక్టర్ చిలుకు స్వామి గారు ఎదగడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. కష్టపడే కార్మిక వర్గం నుంచి వచ్చి, అంకితభావం, నిజాయితీ, నాయకత్వ లక్షణాలతో తెలంగాణ శ్రమశక్తి అవార్డును అందుకోవడం సాధారణ విషయం కాదు” అని కొనియాడారు. ట్రాక్‌మెన్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన డాక్టర్ చిలుకు స్వామి గారు, నిరంతర శ్రమ, పట్టుదల, సేవాభావంతో దక్షిణ భారతదేశంలోనే ఒక రైల్వే విభాగానికి చెందిన కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆయన నాయకత్వ ప్రతిభకు, కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. సామాన్య కార్మికుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు వేలాది మంది కార్మికులకు, యువతకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. సమాజ అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తూ, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న డాక్టర్ చిలుకు స్వామి గారి సేవలు మరింత విస్తరించాలని, భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన గుర్తింపులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సన్మానోత్సవంలో వివిధ సామాజిక, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ చిలుకు స్వామి గారికి శుభాకాంక్షలు తెలిపారు. “శ్రమను నమ్ముకున్నవారికి విజయం తప్పదు... డాక్టర్ చిలుకు స్వామి గారి జీవితం అందుకు సజీవ సాక్ష్యం” అని సభలో పలువురు వక్తలు పేర్కొన్నారు.

# ఆత్మీయతకు వేదికగా సాయి కిరణ్ జడ్జి జన్మదినోత్సవం



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

జై భీమ్ టీవీ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ,ఎస్ఎస్ రాజు ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత సాయి కిరణ్ జడ్జి జన్మదిన సందర్భంగా నిర్వహించిన వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జై భీమ్ టీవీ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ,ఎస్ఎస్ రాజు సాయి కిరణ్ జడ్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సాయి కిరణ్ జడ్జి స్నేహానికి,ఆప్యాయతకు ప్రతీకగా నిలుస్తూ అందరితో ఆత్మీయ సంబంధాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొని సాయి కిరణ్ జడ్జికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మీయ పలకరింపులు, స్నేహపూర్వక సంభాషణల మధ్య వేడుకలు హర్షాతిరేకాల నడుమ కొనసాగాయి. “స్నేహబంధాలకు చిరునామాగా, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచిన సాయి కిరణ్ జడ్జికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ”.

# రాజ్యాంగానికి రక్షకులెవరు!

మొదటి పేజీ తరువాయి


గమనించాలన్నారు.భారత రాజ్యాంగంలోని ఒక్కొక్క అక్షరాన్ని ఒక్కొక్క ఆర్టికల్ ను ఒక్కొక్క చట్టాన్ని ఒక్కొక్క న్యాయస్థాన విలువలను గమనిస్తుంటే రాజకీయ నాయకుల శరీరాలు గగ్గోలు పడుతున్నాయని గుర్తు చేశారు.రాజకీయంగా ప్రజలను పాలించే చాతకాకనే రాజ్యాంగంపై అపనిందలు వేస్తున్నారని హెచ్చరించారు.దేశ ప్రజలకు సరైన విధాలుగా న్యాయం చేయలేకనే మతం అనే సిద్ధాంతాలను దేశ ప్రజలపై రుద్దుతున్నారని తీవ్రంగా విమర్శించారు.ప్రజల జీవన విధానానికి అనుకూలంగా సాగాల్సిన దేశ పరిపాలన ప్రజలను అణిచివేత ధోరణిలో ప్రజా విలువలను నిర్మూలించే ధోరణిలో ప్రజలకు ఏమాత్రం రక్షణ కల్పించలేని ధోరణిలో ముందుకు సాగడం రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ స్వార్థపూరిత రాజకీయ పాలన సాగిస్తుండటమేనని విమర్శించారు.దేశ యువత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఎంతలా ప్రయాస పడాల్సిన అవసరం ఉందో ప్రస్తుత దేశ రాజకీయాలను చూస్తుంటే యువత బాధ్యతను గుర్తు చేస్తుందని తెలిపారు.ఉత్తరాది రాష్ట్రాలు భారత రాజ్యాంగం అంటేనే గజగజ వణికి పోతున్నాయని అట్టి పరిస్థితులు దక్షిణాది రాష్ట్రాల వైపు కూడా వీస్తున్నాయని అప్పటికే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయాలను కాస్టీ చేసేసాయని విమర్శించారు.జాతీయ ఎన్నికల కమిషన్ విధానం ఎప్పుడైతే మార్చబడిందో భారత రాజ్యాంగంలోని ప్రధాన చట్టాలన్ని రాజకీయాలకు అనుగుణంగా మార్చుకుంటున్న విధానం భారత రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని ఇలాంటి విధానాలు సరిగ్గా చదువు లేని వ్యక్తులే చదువులేని రాజకీయ నాయకులే పాటిస్తారని తీవ్రంగా విమర్శించారు.భారత రాజ్యాంగం భారతదేశం అన్ని మతాలకు అన్ని కులాలకు అన్ని జాతులకు అన్ని తెగలకు అన్ని వర్గాల ప్రజలకు సర్వసమానమైన హక్కులను కల్పించినప్పుడు మతాల పేరు మీద కులాల పేరు మీద జాతుల పేరు మీద తెగల పేరు మీద వర్గాల పేరు మీద సమానత్వపు హక్కులను తొలగిస్తూ ఆధిపత్యపు అహంకారాన్ని పెంచి పోషించడం భారత రాజ్యాంగ విలువలకు విరుద్ధమని తెలిసినప్పటికిని నేటి పాలకులు దానిని తూచా తప్పకుండా పాటిస్తూ తూచా తప్పకుండా ఆచరిస్తూ తూచా తప్పకుండా అమలుపరుస్తుండడం గమనిస్తుంటే దేశ ప్రజల మనుగడ కన్నా వ్యక్తిగత అహంకార అనాలోచిత పరిపాలనలకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లుగా కనిపిస్తుంది అన్నారు.దేశ ప్రజలకు అన్యాయం చేయమని రాజ్యాంగంలో ఎక్కడ రాయబడలేదని రాజకీయ నాయకుల అవసరాలను బట్టి రాజకీయ నాయకుల అక్కర్లను బట్టి రాజకీయ నాయకుల స్వార్థాలను బట్టి రాజకీయ నాయకుల అక్రమ సంపాదనలను బట్టి భారత రాజ్యాంగానికి భయపడి భారత రాజ్యాంగాన్ని దూరం పెడుతూ దేశాన్ని పూర్తిగా విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఆర్థిక దోపిడీ ప్రపంచ దేశాలను కళ్ళు తెరిపిస్తుందని విమర్శలు గుప్పించారు.రాజకీయం అంటేనే దోచుకోవడానికి దోచుకున్నది దాచుకోవడానికి అనే విధంగా రాజకీయ అధికార పదవులు సంపాదించుకోవడం అనవాయితిగా మారిపోతుందన్నారు.

**న్యాయస్థానాలు నామమట్టుకేనా..**

గతంలో న్యాయస్థానాల పేర్లు ఉచ్చరిస్తే అక్రమార్కుల అవినీతిపరుల మోసగాళ్ల వ్యభిచారుల, దుర్మార్గుల,అసాంఘిక శక్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవని అలాంటిది చట్టాలను అదుపులోకి తీసుకొని దుర్మార్గమైన తప్పులకు పాల్పడుతున్న వ్యక్తులందరూ న్యాయస్థానాలవైపు వచ్చినప్పుడు న్యాయస్థానాల మెట్లు ఎక్కాలంటేనే గజగజ వనికిపోయేవారని దేశ పరిస్థితులను దేశ రాజకీయాలను అదిమి పట్టుకున్న న్యాయస్థానాలు దేశానికి చెక్కుచెదరని భద్రత వలయాన్ని కల్పించాలని గర్వంగా చెప్పారు.న్యాయస్థానాలు అంటేనే దేశ ప్రజల మేలుకోరేవని భారత రాజ్యాంగాన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్న సందర్భంలో న్యాయస్థానాలు పూర్తిగా భద్రత కల్పిస్తూ రాజకీయ పార్టీలకు చివాట్లు పెట్టే విధంగా దేశ ప్రజలకు రక్షణగా నిలిచిన సందర్భాలు సంవత్సరాల కాలాలపాటు దేశ ప్రజలు చూస్తున్నారన్నది వాస్తవమన్నారు.ఈ విధంగా దేశ ప్రజలకు రక్షణ కల్పించిన న్యాయస్థానాలే అదే ప్రజలు ఇంతలా ఇబ్బందులు పడుతుంటే పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నాయని దేశ ప్రజల బాధలను వాళ్లు వ్యక్తపరుస్తున్న ఆవేదనలను న్యాయస్థానాలకు న్యాయమూర్తులకు, తెలియజేశారు.భారతదేశానికి స్వాతంత్ర్యం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు దేశాన్ని పాలిస్తున్న పాలకులు అదుపుతప్పుతున్న సందర్భంలో ప్రజలకు సేవలందించడంలో విఫలం అవుతున్న సందర్భంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సందర్భంలో ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్న ప్రతి సందర్భంలో న్యాయస్థానాలు మాత్రమే భారత రాజ్యాంగానికి కట్టుబడి ప్రజల తరఫున నిలబడేవని గుర్తు చేశారు.అలాంటి న్యాయస్థానాలు అలాంటి న్యాయమూర్తుల సమూహాలు నేడు భారతదేశ చిన్న భిన్నమైపోతున్న పరిస్థితులను బేరిజ్ వేయలేకపోతున్నారని గుర్తు చేశారు.ప్రజల వైపు నిలబడాల్సిన న్యాయస్థానాలు కొంతమంది న్యాయమూర్తులు వ్యక్తిగత స్వార్థాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల బాగోగులను మర్చిపోతున్నారని రాజకీయ పార్టీల ఒత్తిళ్లతో రాజకీయ పార్టీల పైరవీలతో కేసుల విచారణలు నిజాయితీకి విరుద్ధంగా అవరోధాలను సృష్టిస్తున్నాయని ప్రజలు వాపోతున్నట్లుగా గుర్తు చేశారు.భారత రాజ్యాంగంలో న్యాయమూర్తుల పదవులు అంటేనే కేవలం దేశం కోసం పాటుపడే విధంగా ఉంటాయని భావిస్తున్న సందర్భంలో ప్రస్తుతం దేశంలో చాలామంది న్యాయమూర్తులు రాజకీయ పదవులకు ఆశపడుతూ రాజకీయ పదవుల కోసం పదవి విరమణ తదనంతరం పలు రాష్ట్రాల్లో కీలకమైన రాజకీయ పదవులను చేపడుతున్నారని అలాంటివి అన్నీ అధికార పదవుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరించిన మూలంగానే ప్రభుత్వాలు పలు విధాల పదవులను కట్టబెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు.న్యాయమూర్తులు పదవి విరమణ పొందకముందే గవర్నర్ హోదాలలో మరి ఇతర ఉన్నత అధికార పదవులలో కొనసాగినట్లయితే తప్పులకు పాల్పడ్డ సందర్భాలను పరిగణలోకి తీసుకుంటూ వాళ్లపై చర్యలు చేపట్టే ఆస్కారాలు ఉండేవని అలా కాకుండా పదవి విరమణ పొందాక కీలకమైన పదవుల్లో కొనసాగడం అనేది రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమని తెలిసినప్పటికిని పదవులు పొందుకుంటున్న న్యాయమూర్తులు పదవులు కట్టబెడుతున్న రాజకీయ పార్టీలు ఉన్నత స్థాయిలో భారత రాజ్యాంగాన్ని అణిచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఇలాంటి క్రియల ద్వారా ప్రత్యక్ష పరచబడుతుందని దేశ ప్రజలు బలంగా నమ్ముతున్నారని తెలిపారు.న్యాయవ్యవస్థ అదుపు తప్పితే దేశం ఎంతటి ప్రమాదంలో ఇరుక్కుపోతుందో, చిక్కుకుపోతుందో నేటి దేశ పరిస్థితులను గమనిస్తే స్పష్టంగా అర్థమవుతుందని తెలుపుతూ దేశవ్యాప్తంగా న్యాయమూర్తులుగా పదవులలో కొనసాగుతున్న వాళ్లందరూ భారత రాజ్యాంగాన్ని కాపాడాలంటూ వాళ్ల చేతిలోనే దేశ భవిష్యత్తు రాజకీయ నాయకుల,రాజకీయ పార్టీల,భవిష్యత్తు ఉందనే విషయాన్ని పసిగట్టాలని మరొక్కసారి కోరారు.వ్యక్తిగత స్వార్థాలను వీడి దేశ భవిష్యత్తును నిర్మించండి అంటూ మీకన్నా దేశంలో గొప్పవాళ్లు ఎవరూ లేరనే సంకేతాలను మరొక్కసారి చాటిచెప్పండి అంటూ వివరించారు.

# 26 ఏళ్ల కాంగ్రెస్ సేవకు గుర్తింపు గాంధీభవన్‌లో మీనాక్షి నటరాజన్‌తో ఆదుపా మహేష్ ప్రత్యేక భేటీ









**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ పార్టీకి 26 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న ఆదుపా మహేష్‌కు పార్టీ అధిష్టానం నుంచి ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆహ్వానం మేరకు గాంధీభవన్‌లో జరిగిన ప్రత్యేక వన్-టు-వన్ సమావేశంలో ఆదుపా మహేష్ పాల్గొన్నారు. 1999 సంవత్సరం నుంచి కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం నిరంతరం పనిచేస్తున్న ఆదుపా మహేష్, తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవికి తన అభ్యర్థిత్వాన్ని వినతిపత్రం ద్వారా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు.తన 26 ఏళ్ల రాజకీయ,సామాజిక సేవలకు సంబంధించిన పూర్తి వివరాలు, పత్రికా కథనాలు, పార్టీ కార్యక్రమాల్లో తన పాత్రకు సంబంధించిన ఆధారాలను నాయకత్వానికి సమర్పించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులను కలిసి వారి ఆశీస్సులు,మద్దతు కోరినట్లు ఆదుపా మహేష్ తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు గంపా వేణుగోపాల్ ఆహ్వానం మేరకు మీనాక్షి నటరాజన్‌తో జరిగిన ప్రత్యేక సమావేశంలో తన రాజకీయ ప్రస్థానం, పార్టీ కోసం చేసిన సేవలు, బీసీ వర్గాల అభివృద్ధిపై తన ఆలోచనలను వివరించారు. ఈ సందర్భంగా ఆదుపా మహేష్ మాట్లాడుతూ, “1999 నుంచి కాంగ్రెస్ పార్టీనే నా కుటుంబంగా భావించి పని చేస్తున్నాను. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో కూడా పార్టీ జెండాను విడిచిపెట్టలేదు. పార్టీ నాకు అవకాశం కల్పిస్తే బీసీ వర్గాల అభ్యున్నతి కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తాను” అని తెలిపారు. ఆదుపా మహేష్‌కు బీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. ఆయన సుదీర్ఘ సేవలు,పార్టీ పట్ల నిబద్ధత, ప్రజల్లో ఉన్న గుర్తింపును పరిగణనలోకి తీసుకుని తగిన బాధ్యత అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 26 ఏళ్ల కాంగ్రెస్ ప్రస్థానం -- పార్టీ పట్ల అచంచల విశ్వాసం బీసీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆదుపా మహేష్ ముందుకు సాగుతున్నారని ఆయన అనుచరులు పేర్కొన్నారు.

# తాలు, తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు

**రైతుకు నష్టం కలిగించే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, ఎర్రమంజిల్ కాలనీ, జై భీమ్ న్యూస్**




ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో రైతులకు కోతలు విధిస్తే మిల్లర్లతో పాటు కొనుగోలు సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రైతులకు నష్టం కలిగించే ఏ చర్యనైనా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ఆదివారం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని రాష్ట్ర పౌర సరఫరాల కేంద్ర కార్యాలయం నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాలకు చేరుకుని కాంటా కోసం ఎదురుచూస్తున్న 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అకాల వర్షాలు, గాలివానలు, వడగండ్ల వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొంటూ, రైతుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గందరగోళం సృష్టించవద్దని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాత ప్రభుత్వమని పేర్కొన్న మంత్రి, ఖరీఫ్ మరియు రబీ సీజన్లకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.45 వేల కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రికార్డు స్థాయిలో కొనుగోళ్లు చేపట్టామని చెప్పారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలిస్తూ బాయిల్డ్ రైస్‌గా మారుస్తోందన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,749 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. రబీ సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని మంత్రి తెలిపారు. తాజా అంచనాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయనుండగా, ఇప్పటికే 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 21 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయని, కొరత ఉందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు ఎన్నికల కారణంగా స్వగ్రామాలకు వెళ్లడంతో కొంత జాప్యం ఏర్పడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేస్తోందని, మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేంద్రం పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేపట్టడం లేదని విమర్శించారు.

## హుటాహుటిన స్పందించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న

**స్పృహ తప్పిన మహిళకు సకాలంలో ప్రాణ రక్షణ**




**హన్మకొండ, 24 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తత, మానవత్వంతో కూడిన సేవ మరోసారి ప్రజల ప్రశంసలు అందుకుంది. హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఓ మహిళ అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోవడంతో అక్కడ బందోబస్తు విధులు నిర్వహిస్తున్న కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న వెంటనే స్పందించి ఆమెకు ప్రాణ రక్షణ కల్పించారు. సమాచారం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఓ మహిళ తన వాహనానికి పెట్రోల్ పోయించేందుకు హంటర్ రోడ్‌లోని పెట్రోల్ బంక్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఆమె ఒక్కసారిగా అస్వస్థతకు గురై స్పృహ తప్పి నేలపై పడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న పరిస్థితిని గమనించి వెంటనే మహిళ వద్దకు చేరుకొని స్పందించారు. తక్షణమే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించిన ఆయన, అంబులెన్స్ వచ్చే వరకు మహిళకు అవసరమైన సహాయం అందేలా స్థానికులతో కలిసి చర్యలు చేపట్టారు. అనంతరం అంబులెన్స్ చేరుకోగానే మహిళను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విధి నిర్వహణలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ చేపడుతూనే మానవత్వంతో స్పందించి మహిళకు సకాలంలో సహాయం అందించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న సేవలను స్థానికులు అభినందించారు. పోలీసుల వేగవంతమైన స్పందనతో మహిళకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడగలిగారని ప్రజలు పేర్కొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహణ

**ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**



జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం/సోమవారం యథావిధిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరై సంబంధిత అధికారులకు వివరాలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిశీలించి, సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజలు సమర్పించే వినతులను నేరుగా స్వీకరించి, శాఖల వారీగా సమీక్షించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శక, సమర్థవంతమైన పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజావాణి కార్యక్రమాన్ని ఆ దిశగా మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## పీపీసీ కేంద్రాలు, రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించిన డాక్టర్ సత్య శారద





**వరంగల్, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో డాక్టర్ సత్య శారద ఆదివారం సంగెం, వర్ధన్నపేట మండలాల్లోని పీపీసీ కేంద్రాలు మరియు రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. మొదట సంగెం మండలంలోని కాట్రపల్లి పీపీసీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ ధాన్యం కొనుగోలు విధానం, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, నిల్వలు, తరలింపు ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం కాపులకనపర్తి గ్రామంలోని శ్రీవాణి రైస్ మిల్లును సందర్శించి మిల్లింగ్ కార్యకలాపాలను సమీక్షించారు. తదుపరి వర్ధన్నపేట మండలంలోని కదిరిగూడెం భవాని ఎఫ్‌పీఓ, రామదాన్ తండా ఏరువాక ఎఫ్‌పీఓ, చంద్రు తండా పీపీసీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, సీఈఓ జెడ్పీ రాంరెడ్డి, పీడీ డీఆర్‌డీఏ నాగపద్మజా, డీసీఓ నీరజ, డీఎస్‌ఓ కిష్టయ్య, డీఎంసీఎస్ సంధ్యారాణి తదితర అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, నిల్వలు, రవాణా, మిల్లింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడంతో పాటు రైస్ మిల్లుల్లో మిల్లింగ్ పనులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే వాతావరణ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రైతులకు వడదెబ్బ తగలకుండా తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కేంద్రాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సెంటర్ ఇంచార్జ్‌లకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సెంటర్ ఇంచార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి: ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు.

## విద్యార్థుల కలయికతో సందడి చేసిన 2010-11 బ్యాచ్ స్నేహ సమ్మేళనం



**జై భీమ్ న్యూస్(స్టేషన్‌ఘనపూర్)**

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని శ్రీవాణి గురుకుల విద్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన రాజ 2010-11 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ స్నేహ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. దాదాపు 15 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని, తమ కుటుంబ, ఉద్యోగ, సామాజిక జీవితంలోని అనుభవాలను పంచుకున్నారు. పాఠశాలలో గడిపిన రోజులు జీవితానికి బలమైన పునాది వేశాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగుతూ ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థుల ఐక్యత, అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ స్నేహ సమ్మేళనం అందరికీ చిరస్మరణీయంగా మారింది.

## వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా హనుమకొండ నగరానికి విచ్చేసిన సీనియర్ నాయకుడు వేం నరేందర్ రెడ్డిను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నగరంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ వివరించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పోలీసుల సేవలను అభినందించినట్లు సమాచారం.

## యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో చాహత్ బాజ్ పాయి ఆదివారం హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల హనుమకొండ, శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ములుగు రోడ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎల్‌బీ కళాశాల, బాలసముద్రంలోని నేషనల్ హై స్కూల్ (ఎస్సార్ ఎడ్యుకేషన్) తదితర కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అభ్యర్థులకు కల్పించిన తాగునీరు, కూర్చునే సదుపాయాలు, వైద్య సహాయం తదితర అంశాలను తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలి: బోర్డే హేమంత్ సహదేవరావు






**ములుగు, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల ప్రభావంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బోర్డే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు)పై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు త్వరితగతిన అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను నిరంతరం పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేసిన అధికారులు, రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రం రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.45 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేస్తోందని తెలిపారు. పంటల అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేల సారవంతత దెబ్బతింటుందని, రైతులకు దీనిపై అవగాహన కల్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. అలాగే ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో పాటు సుధీర్ రామ్ నాథ్ కేకన్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎం సివిల్ సప్లయ్స్ కృష్ణవేణి, డీడబ్ల్యూఓ ప్రేమలత, సీపీఓ ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ యూత్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌లో మెరిసిన కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థినులు






**హన్మకొండ, 24 మే 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ఎం.ఎస్‌సి బయోటెక్నాలజీ నాల్గవ సెమిస్టర్ విద్యార్థినులు సనా, అమతుల్ నూర్ తెలంగాణ యూత్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్--2026లో డెలిగేట్లుగా ఎంపికై ప్రతిభ చాటుకున్నారు. ఈ కాన్ఫరెన్స్ మే 21, 22 తేదీలలో హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన యువ ప్రతినిధులతో పాటు పాల్గొన్న కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థినులు వివిధ సాంకేతిక సెషన్లు, గ్రూప్ డిస్కషన్లు, అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. వారి ప్రదర్శనతో కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని అధ్యాపకులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్‌కు సంబంధించిన తదుపరి ఎంపిక ప్రక్రియ కోసం విద్యార్థినులు ఎదురుచూస్తున్నారు. ఎంపికైతే స్వీడన్‌లో జరిగే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో విశ్వవిద్యాలయాన్ని ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించనుంది. ఈ సందర్భంగా స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్తేరి మామిడాల మరియు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ రాధిక తిప్పని విద్యార్థినులను అభినందించి, తదుపరి స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ వేదికపై విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# హసన్‌పర్తిలో అప్రమత్తమైన పోలీసుల తక్షణ స్పందన

**వరి కొయ్యలు తగులబెట్టొద్దని రైతులకు హెచ్చరిక**
**ఇండియన్ స్కూల్ - విహాన్ స్కూల్ సమీపంలో వరి కొయ్యలకు మంటలు..**
**అప్రమత్తంగా స్పందించిన పోలీసులు**



**హన్మకొండ జిల్లా/ హసన్‌పర్తి, 24 మే 2026 (జై భీమ్ న్యూస్)**




హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండియన్ స్కూల్ మరియు విహాన్ స్కూల్ ముందు ఉన్న వ్యవసాయ పొలంలో వరి కొయ్యలు కాలుతున్నాయని సమాచారం అందడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. స్కూల్ సమీపంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం సుమారు 06:30 గంటల సమయంలో ఘటనపై సమాచారం అందుకున్న హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ వెంటనే పోలీస్ బలగాలు, బ్లూ కోట్స్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. పొలంలో ఎండిన వరి కొయ్యలు అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించే పరిస్థితి ఏర్పడింది. పోలీసులు స్థానికుల సహకారంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టి మంటలను నియంత్రణలోకి తీసుకువచ్చారు. స్కూల్ సమీప ప్రాంతం కావడంతో విద్యార్థులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. సమయానికి స్పందించడంతో పెద్ద అగ్నిప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు పోలీసులు ధృవీకరించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. అవసరమైతే సంబంధిత అధికార యంత్రాంగాలతో సమన్వయం చేసుకుని మరింత చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హసన్ పర్తి పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ మాట్లాడుతూ, పొలాల మధ్య చెత్త, పొడి గడ్డి, ప్లాస్టిక్ వంటి సులభంగా మండే పదార్థాలను నిర్లక్ష్యంగా వదిలేయరాదని సూచించారు. వరి కొయ్యలు లేదా పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు భారీ అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా స్కూల్లు, నివాస ప్రాంతాలు, రహదారుల సమీపంలో ఇలాంటి చర్యలు ప్రమాదకరమని తెలిపారు. ఏదైనా అగ్నిప్రమాదం గమనించిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు 8712685015 నంబర్ ద్వారా గాని, అత్యవసర హెల్ప్‌లైన్ 100కు గాని సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వేతనాల చెల్లింపులో వేధింపులు..!

**అనుకూలమైన ఉద్యోగులకు పెద్దపీట..**
**అనుకూలంగా లేని వారిపై అణిచివేత..?**
**డబ్బులిస్తేనే జీతాలు వస్తాయా..?**
**విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్ల జీతాలు అధికారికంగా చెల్లించేది ఎవరు..?**
**ప్రతి మండలంలో ఇదే పరిస్థితి అంటూ ఉద్యోగుల ఆవేదన**
**జీతాల బిల్లులు చేయాలంటే చేతివాటం ముట్టాల్సిందేనా..?**
**పై అధికారులకు తెలియకుండానే ఈ వ్యవహారాలన్నీ జరుగుతున్నాయా..?**
**ఏసీబీ దాడులు కొనసాగుతున్నా మారని రెవెన్యూ కార్యాలయాల తీరు..!**

**హన్మకొండ, 24 మే 2026 (జై భీమ్ న్యూస్)**




రెవెన్యూ శాఖలో వేతనాల చెల్లింపుల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్ల (వీఆర్ఏ) జీతాల బిల్లుల విషయంలో కొందరు అధికారులు, సిబ్బంది అనధికార జోక్యం చేసుకుంటూ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుకూలంగా ఉన్న ఉద్యోగులకు సులభంగా బిల్లులు క్లియర్ చేస్తూ, తమకు అనుకూలంగా లేని వారిపై వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వీఆర్ఏలు నెలల తరబడి జీతాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, "చేతివాటం" లేకుండా బిల్లులు ముందుకు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా వీఆర్ఏల జీతాల చెల్లింపుల బాధ్యత సంబంధిత రెవెన్యూ అధికారులదే అయినప్పటికీ, మధ్యవర్తుల్లా వ్యవహరిస్తున్న కొందరు సిబ్బంది మొత్తం వ్యవస్థను తమ ఆధీనంలో పెట్టుకున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. "డబ్బులు ఇస్తేనే జీతాలు వస్తాయా..?" అని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మండల స్థాయి కార్యాలయాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ అక్రమ డబ్బు సంపాదన మార్గాలను కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సిబ్బంది తమ ప్రభావాన్ని ఉపయోగించి పై అధికారుల పేర్లు చెప్పుకుంటూ భయాందోళనలకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా పై అధికారులకు నిజంగా ఈ వ్యవహారాలపై సమాచారం లేదా..? లేక తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఏసీబీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తూ అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటున్నా, కొన్ని రెవెన్యూ కార్యాలయాల్లో మాత్రం పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఉద్యోగుల వేతనాల విషయంలో పారదర్శకత తీసుకురావాలని, బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వీఆర్ఏలు మరియు ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై మరిన్ని సంచలన విషయాలు, బాధితుల వాంగ్మూలాలు, సంబంధిత అధికారుల స్పందనతో తదుపరి సంచికలో...

# భారత క్రీడా సంస్కృతి మార్పులు..

**ఒలింపిక్ విలువల నుంచి ఐపీఎల్ స్పోర్ట్స్ వరకు యువత ప్రయాణం**
**డాక్టర్ ఎం. కృష్ణ సుమంత్, కాకతీయ యూనివర్సిటీ**

**హన్మకొండ, 24 మే 2026 (జై భీమ్ న్యూస్)**



భారతదేశంలో క్రీడల పట్ల యువత ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, గ్రామీణ భారతదేశం నుంచి పట్టణాల వరకు క్రీడలు ఇప్పుడు యువత జీవితాల్లో కీలక భాగంగా మారాయని డాక్టర్ ఎం. కృష్ణ సుమంత్, కాకతీయ యూనివర్సిటీ పేర్కొన్నారు. ఒకప్పుడు కేవలం వినోదంగా భావించిన క్రీడలు, ప్రస్తుతం ఉపాధి, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం భారత క్రీడా వ్యవస్థలో పెద్ద మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా ఒలింపిక్ విలువలను యువతలో పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒలింపిక్స్ ఒక దేశ గౌరవానికి ప్రతీకగా మారగా, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, పోటీ తత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. 2008 తర్వాత భారత క్రీడా రంగంలో కొత్త ఉత్సాహం కనిపించిందని, షూటింగ్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో భారత క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. మరోవైపు, ఆధునిక సాంకేతికత అభివృద్ధితో ఈస్పోర్ట్స్ రంగం యువతను విపరీతంగా ఆకర్షిస్తోందని చెప్పారు. మొబైల్ గేమింగ్, పీసీ గేమింగ్, డిజిటల్ స్ట్రీమింగ్ వేదికల ద్వారా ఈస్పోర్ట్స్‌కు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని, అనేక మంది యువకులు దీనిని కెరీర్‌గా ఎంచుకుంటూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో శారీరక వ్యాయామం, మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడే సాధనంగా మారుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు కూడా క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని, గ్రామీణ యువతకు శిక్షణ, స్టేడియంలు, స్పోర్ట్స్ టూరిజం అవకాశాలు కల్పించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. క్రీడలు కేవలం విజయం కోసం మాత్రమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కూడా అవసరమని, యువత ఒలింపిక్ విలువలను ఆచరిస్తూ క్రీడల పట్ల మరింత ఆసక్తి పెంపొందించుకుంటే భారతదేశం ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగడం ఖాయమని డాక్టర్ ఎం. కృష్ణ సుమంత్ అభిప్రాయపడ్డారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 24 మే 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల ప్రభావంతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్‌తో పాటు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న మహిళా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వచ్చే పది రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు త్వరితగతిన అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేస్తూ, రైతులను ఇబ్బందులకు గురిచేసే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.45 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు నేల సారవంతత దెబ్బతింటుందని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపనలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య సమావేశాలు, "అమ్మ మాట -- అంగన్వాడి బాట" కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీ ధార కవిత హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీఓ మేన శ్రీను, డీడబ్ల్యూఓ విశ్వజ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**ప్రజావాణికి ప్రజలు వినతిపత్రాలతో హాజరుకావాలి : కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, 24 మే 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరై సంబంధిత అధికారులకు వివరాలు అందజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వర పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు సమర్పించే వినతిపత్రాలను పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రజావాణి ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.

# ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

**కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్**
**వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్**
**ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ**
**మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య**
**గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు..

**తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం**
**ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం**
**వ్యవసాయ కనెక్షన్లు మినహా అందరికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం**
**మీటర్ల ఖర్చును 60:40 నిష్పత్తిలో భరించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**
**వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్న ప్రభుత్వం**
**గత ప్రభుత్వ ఒప్పందాన్నే తాము ముందుకు తీసుకెళ్తున్నామన్న మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మినహా అన్ని విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్)లో చేరాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం సమావేశమైన కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని గృహ, వాణిజ్య కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. కేబినెట్ సమావేశం అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అయితే, ఈ ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర విద్యుత్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. కానీ, నాటి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లలేదని, అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వాలే భరిస్తాయని, వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం వ్యయంలో 60% కేంద్ర ప్రభుత్వం, 40% రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి మరోసారి తేల్చిచెప్పారు. డిస్కంల ఆదాయ, వ్యయాల మధ్య అంతరాన్ని తగ్గించి, వాటిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కాగా, విద్యుత్ ఛార్జీల పెంపు అంశం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) పరిధిలోనే ఉంటుందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు, ఛార్జీల పెంపునకు ప్రత్యక్ష సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు.

# ఐదు నిమిషాల ఆలస్యం.. యూపీఎస్సీ కలకు గండం




**హన్మకొండ, 24 మే 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షల్లో భాగంగా హనుమకొండ జిల్లా వడ్డేపల్లి పింగళి కళాశాల పరీక్షా కేంద్రం వద్ద పలువురు అభ్యర్థులు ఆలస్యంగా చేరుకుని పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారు. సుమారు 10 నుంచి 12 మంది అభ్యర్థులు రెండు నుంచి ఐదు నిమిషాల ఆలస్యంతో కేంద్రానికి చేరుకోవడంతో అధికారులు అనుమతి నిరాకరించారు. పరీక్ష ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైనప్పటికీ, కేంద్రంలోకి ఉదయం 9 గంటల వరకే ప్రవేశం కల్పించినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం హాల్ టికెట్ ధృవీకరణ, బయోమెట్రిక్ నమోదు, భద్రతా తనిఖీలు నిర్వహించాల్సి ఉండటంతో గేట్లు మూసివేసినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల ద్వారా వచ్చిన అభ్యర్థులు ట్రైన్, బస్సులు ఆలస్యంగా రావడంతో సమయానికి చేరుకోలేకపోయామని వాపోయారు. ఎంతగా వేడుకున్నప్పటికీ సిబ్బంది గేట్లు తెరవకపోవడంతో కొందరు అభ్యర్థులు అక్కడికక్కడే కన్నీటి పర్యంత మయ్యారు. ఈ దృశ్యాలు తల్లిదండ్రులను కూడా కలచివేశాయి. అయితే పోటీ పరీక్షల్లో సమయపాలన అత్యంత ముఖ్యమని, అభ్యర్థులు ముందస్తు ప్రణాళికతో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా జీవిత లక్ష్యాలపై ప్రభావం చూపుతుందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# రేవంత్‌కు మోదీ ఆఫర్..

**భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చు: ధర్మపురి అర్వింద్**
**సువేందు అధికారి, షిండేకు ఇచ్చినట్టుగా రేవంత్ కు మోదీ ఆఫర్ ఇచ్చి ఉండొచ్చన్న అర్వింద్**
**ఆఫర్ తిరస్కరించినందుకు భవిష్యత్తులో రేవంత్ పాశ్చాత్తాప పడొచ్చని వ్యాఖ్య**
**భగీరథ్ పై పోక్సో కేసు వెనుక తన హస్తం ఉందన్న ప్రచారాన్ని ఖండించిన అర్వింద్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా మోదీ ఒక ఛాన్స్ ఇచ్చారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండేలకు ఇచ్చిన తరహాలోనే రేవంత్‌రెడ్డికి కూడా మోదీ ఆఫర్ ఇచ్చి ఉండవచ్చని, ఈ ప్రతిపాదనను తిరస్కరించినందుకు భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడాల్సి రావచ్చని వ్యాఖ్యానించారు. ఇక పార్టీ అంతర్గత వ్యవహారాలు, వివాదాలపై కూడా అరవింద్ ఓపెన్‌గా స్పందించారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో ఉన్న విభేదాలపై మాట్లాడుతూ.. పార్టీలో అభిప్రాయ భేదాలు సహజమని, అయితే తాను ఎవరిపైనా అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయలేదన్నారు. అలాగే బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వెనుక తన హస్తం ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు, ఆ ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదన్నారు. పోక్సో కేసు నమోదైన తర్వాత తాను బండి సంజయ్ తో మాట్లాడలేదని చెప్పారు. గతంలో తానే రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలని కోరానని, అయితే కొత్తగా పార్టీలోకి రావడంతో అది కుదరదని అధిష్ఠానం తేల్చి చెప్పినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి వస్తున్నా, తెలంగాణలో మాత్రం అధికారం చేరువలో కనిపించకపోవడానికి స్థానిక నాయకత్వ సమస్యలే కారణమని అర్వింద్ అంగీకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ తరహాలో పెద్ద గ్రూప్ లీడర్లు లేకపోవడం తమ పార్టీకి ప్రధాన సమస్యగా మారిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తాము అధికారంలోకి రాకపోవడం తమ పార్టీ తప్పేనని, ప్రజలు ఆ సమయంలో తమను కోరుకోలేదన్నది నిజమని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని సగం క్యాబినెట్‌లో క్వాలిటీ కాంగ్రెస్ లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర పనిచేసేందుకు మంత్రులే ఇష్టపడటం లేదని అన్నారు.

# హైదరాబాద్‌లో కార్ రేసర్ల వీరంగం.. అడ్డుకున్న కానిస్టేబుల్‌కు గాయం

**హైదరాబాద్ మాదాపూర్‌లో అర్ధరాత్రి కార్ రేసింగ్‌ల హల్‌చల్**
**అడ్డుకున్న కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన యువకుడు**
**ప్రమాదంలో కానిస్టేబుల్ రమేష్ చేతికి ఫ్రాక్చర్**
**కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు**
**వారాంతపు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 294 మందిపై కేసులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని ఐటీ హబ్ మాదాపూర్‌లో యువకులు మరోసారి బరితెగించారు. అర్ధరాత్రి కార్ రేసింగ్‌తో హల్‌చల్ సృష్టించారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టడంతో అతడి చేతికి ఫ్రాక్చర్ అయింది. మాదాపూర్‌లోని నిలోఫర్ కేఫ్ సమీపంలో కొందరు యువకులు కార్ రేసింగ్, స్టంట్లు చేస్తూ గందరగోళం సృష్టించారు. మోడిఫైడ్ సైలెన్సర్‌తో ఓ కారు బీభత్సం సృష్టిస్తుండగా, లాఠీలతో ఉన్న ముగ్గురు పోలీసులు దానిని ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆగకపోవడంతో వెంబడించారు. ఈ క్రమంలో రమేష్ అనే కానిస్టేబుల్ కారును ఆపే ప్రయత్నం చేయగా, డ్రైవర్ ఉద్దేశపూర్వకంగానే అతడిని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ చేతికి గాయమైంది. కారు డ్రైవర్‌ను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన వీడియోలో, ఈ రేసింగ్ చూసేందుకు చాలా మంది యువకులు రోడ్డుపై గుమిగూడినట్లు కనిపించింది. వారాంతాల్లో ఐటీ కారిడార్‌లో యువకులు ప్రమాదకరమైన కార్, బైక్ రేసింగ్‌లకు పాల్పడటం సాధారణమైపోయింది. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా, వారాంతంలో సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో 294 మంది పట్టుబడ్డారు. వీరిలో



255 మంది ద్విచక్రవాహనదారులు, 34 మంది కార్ డ్రైవర్లు, ఐదుగురు ఆటో డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. తాగి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 ప్రకారం 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించనున్నట్లు పోలీసులు హెచ్చరించారు.